ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 28: ఓయూ పరిధిలోని బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కుమెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈనెల 31వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరు వారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 31లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 28: ఓయూ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్-డే), ఎంబీఏ 'టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్) కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎంబీఏ (ఈవినింగ్) ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 4వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో వచ్చే నెల 8వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

పొదుపు భవిష్యత్తుకు భరోసా

- అవగాహన సదస్సులో పోస్టల్ శాఖ సహాయ సూపరింటెండెంట్ సత్యేంద్ర కృష్ణ

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 28: చిన్నమొత్తాల పొదుపు బంగారు భవిష్యత్తుకు భరోసా ఇస్తుందని పోస్టల్ శాఖ సహాయ సూపరింటెండెంట్ జీబీ సత్యేంద్ర కృష్ణ అన్నారు. న్యూబోయిగూడలోని ఐడీహెచ్‌కాలనీలో శనివారం పోస్టల్ శాఖ అందిస్తున్న సేవలు, బీమా, పోస్టల్ బ్యాంకు ఖాతా లాభాల గురించి ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. పోస్టాఫీసుల్లో సుకన్య సమృద్ధి యోజన లాంటి పథకాలు ఆడపిల్లలు ఉన్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. అలాగే, ఆధార్ కార్డులో సవరణలు, కొత్త కార్డుల నమోదు కూడా చేపట్టారని తెలిపారు.

రూ.599లకే పది లక్షల ప్రమాద బీమా..

కేవలం రూ.599కే పది లక్షల ప్రమాద బీమా సదుపాయం లభిస్తున్నదని ఆయన వెల్లడించారు. ఇందులో అనేక ఇతర ప్రయోజనాలు కూడా ఉన్నాయని, వాటి గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి బస్తీల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోస్టల్ బ్యాంకులో ఖాతాలను తెరవాలని, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌లో ప్రతినెలా చిన్న మొత్తాలను పొదుపు చేసుకోవడం అలవాటు చేసుకోవడం ఉత్తమమని ఆయన వివరించారు. బీఆర్ఎస్ బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు మాట్లాడుతూ శిబిరం వల్ల పోస్టల్ శాఖ సేవలపై ప్రజలకు అనేక విషయాలు తెలిశాయని అన్నారు. ఆధార్ కార్డులో సవరణలకు అవకాశాన్ని మరో వారం రోజులపాటు పొడిగించాలని ఆయన అధికారులను కోరారు. శిబిరంలో ప్రజా సంబంధాల ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఏపీఎం హరిచందర్, పోస్ట్‌మ్యాన్ అరుణ్‌కుమార్, ఆధార్ సిబ్బంది రేణుక, జగదీశ్, ఐడీహెచ్ కాలనీ అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు గజ్జెల శ్రీను, శివకుమార్, వెంకటేశ్, శ్రీకాంత్, జగన్, సదానంద్, ప్రదీప్, దేవేందర్ పాల్గొన్నారు.

బోయిగూడలో పోస్టల్ శాఖ సేవల శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎస్పీ జీబీ సత్యేంద్ర కృష్ణ

చిన్నారుల్లో ప్రతిభను ప్రోత్సహించాలి

సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, డిసెంబర్ 28: పిల్లలో ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహిస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. చిక్కడపల్లిలోని సెయింట్ అడమ్స్ పాఠశాలలో శనివారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పిల్లల మనోవికాసానికి సైన్స్ ఎగ్జిబిషన్స్ దోహదం చేస్తాయని పేర్కొన్నారు. కరస్పాడెంట్, ప్రిన్సిపాల్ శ్రవణ్‌కుమార్, బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయులకు అభినందన సత్కారం

సత్కార గ్రహీతలతో నిర్వాహకులు

ముషీరాబాద్, డిసెంబర్ 28: చోడేశ్వరీ నాట్య కళామండలి ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో శతాబ్ది దాటిన మహనీయులకు అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు స్వాతంత్ర్య సమరయోధుడు ఏటుకూరి కృష్ణమూర్తి, ఏటుకూరి కృష్ణ బ్రహ్మానందంను సత్కరించారు. అనంతరం తిరుపతి వేంటకవులు రంచించి పౌరాణిక పద్య నాటకం శ్రీకృష్ణ రాయభారం నాటకాన్ని ప్రదర్శించి అలరించారు. కార్యక్రమంలో ఏటుకూరి చంద్రకిషోర్, స్రవంతి, పూర్ణచందర్ రావు, రవీంద్ర, వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, మాధవ్ ప్రసాద్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదం

అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ ప్రారంభించిన ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీగణేశ్

బేగంపేట్, డిసెంబర్ 28: రాంగోపాల్‌పేట్ డివిజన్, ఆవులమందలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీధర్మశాస్త భక్త బృందం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి దీక్షాధారులకు 41 రోజులపాటు అల్పాహారం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరించారు. 22 ఏండ్లుగా కార్యక్రమ నిర్వాహకులను వారు అభినందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తల్లి మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, కిశోర్ కుమార్, ఆంజనేయులు, గణేశ్, భక్త బృందం ప్రతినిధులు సోమా ఆనంద్, కొవ్వూరి వెంకటేశ్, సుర్యప్రకాశ్, వెంకటనారాయణ, ఆలయ కమిటీ ప్రతినిధులు బాలేందర్, వెంకటేశ్, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతి తీరని లోటు

చిక్కడపల్లి, డిసెంబర్ 28: మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి మన దేశ ఆర్థిక వ్యవస్థకు తీరని లోటుఅని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూపలమాల వేసి నివాళులర్పించారు. భారత ఆర్థిక వ్యవస్థ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఆయన ఎంతగానో కృషి చేశారని వారు పేర్కొన్నారు.

నివాళులర్పిస్తున్న తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్, తదితరులు

న్యూబోయిన్‌పల్లి కడక్‌పురా హజ్రత్ సయ్యద్ దర్గాలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి దర్గాను దర్శించుకొని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఇమ్రాన్ హుస్సేన్, వసీఫ్, హసీన్‌ఖాన్, మైనార్టీ అధ్యక్షుడు శంషాద్, మక్తర్, అజామ్, విజయ్, రిజ్వాన్, సమీర్, అస్లాం, అషు, సజీద్ పాల్గొన్నారు.
– బొల్లారం

వాయిదాపడిన ఎంఫార్మసీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 28: ఓయూ పరిధిలో వాయిదా పడిన ఎంఫార్మసీ పరీక్ష తేదీని ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి చెందిన నేపథ్యంలో ఈనెల 27న రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో ఆ రోజు జరగాల్సిన అన్ని పరీక్షలను అధికారులు వాయిదా వేశారు. ఈ పరీక్షను తిరిగి ఈనెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష సమయం, పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

చిక్కడపల్లి, డిసెంబర్ 28: ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని లక్ష్మీగణపతి ఆలయ వ్యవస్థాపక సభ్యుడు వల్లభదాస్ మృతిచెందారు. దీంతో జవజహర్‌నగర్‌లోని వల్లభదాస్ నివాసం వద్ద విశాద ఛాయలునెలకొన్నాయి. శనివారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ వల్లభదాస్ మృతదేహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, నాయకులు ఎస్టీ అశోక్, దినేష్‌కుమార్, ఎస్టీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

యూజీసీ నెట్ పేపర్-1 పరీక్షకు ముగిసిన ఉచిత శిక్షణ

శిక్షణ పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 28: ఉస్మానియా యూనివర్సిటీ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌సీడీసీ) ఆధ్వర్యంలో యూజీసీ నెట్ పేపర్-1 పరీక్షకు పది రోజుల ఉచిత శిక్షణ శనివారంతో ముగిసింది. సీఎఫ్ఆర్‌డీ భవనంలోని ఈ క్లాస్ రూంలో నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీవీ రంజని, కోఆర్డినేటర్ డాక్టర్ పి.మురళీధర్‌రెడ్డి, అమెరికాలోని బైలర్ కాలేజ్ ఆఫ్ మెడిసిన్ అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాగిరెడ్డి పుట్లూరి మాట్లాడుతూ నెట్ పరీక్షకు సిద్ధమయ్యే విద్యార్థులకు శిక్షణ ఉపయుక్తంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు వారి లక్ష్యాలను సాధించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. శిక్షణకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఇద్దరు అరెస్టు

చిక్కడపల్లి, డిసెంబర్ 28: కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఇద్దరు యువకులను చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీఐ రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం అశోక్‌నగర్ బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్‌లో నివాసించే నర్సింహకు బాలపూర్‌కు చెందిన సవ్రంతితో నెల క్రితం వివాహం జరిగింది. గత కొన్ని రోజులుగా దంపతుల మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంవలో సవ్రంతి సోదరులు సంతోష్, సందీప్ శుక్రవరాం రాత్రి నర్సింహ ఇంటి వచ్చి గొడవకు దిగారు. 100 డయల్ ద్వారా సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కానిస్టేబుల్ శివకుమార్ అడ్డుకునే ప్రయత్నం చేయగా సంతోష్, సందీప్ రాయితో దాడి దిగారు. దీంతో శివకుమార్ తలకు గాయం అయ్యింది. పోలీసులు సంతోష్, సందీప్‌ను అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించారు. కేసును ఎస్సై మౌనిక దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకొని ల్యాబ్ టెక్నీషియన్ ఆత్మహత్య

సైదాబాద్, డిసెంబర్ 28: దవాఖానలో ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేస్తున్న ఓ యువకుడు తన గదిలో చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జనగాం జిల్లా లింగాల ఘనపురం మండలంలోని కుందారం గ్రామానికి చెందిన ఓరుగంటి మల్లేశ్ చిన్న కుమారుడు ఓరుగంటి సింహాద్రి(22) వినయ్‌నగర్ కాలనీలోని అభినయ్ మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ల్యాబ్‌కు సమీపంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. శుక్రవారం సాయంత్రం కుమారుడికి తండ్రి మల్లేశ్ అనేకసార్లు ఫోన్ చేయగా లిప్ట్ చేయకపోవడంతో మళ్లీ రాత్రి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో అనుమానం వచ్చిన తండ్రి తన కుమారుడు ఫోన్ ఎత్తడంలేదని, రూమ్ దగ్గరికి వెళ్లి చూడమని ల్యాబ్‌లోని సింహాద్రి స్నేహితులకు, బంధువుకు చెప్పాడు. శనివారం ఉదయం వచ్చి చూడగా సింహాద్రి గదిగడియపెట్టుకొని చున్నీతో ఫ్యాన్ హుక్కుకు ఉరివేసుకొని కన్పించాడు. సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడి తండ్రి మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉన్నది.

ఆర్థికశాస్త్రం ప్రతి జీవితంతో ముడిపడి ఉంటుంది

కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ పుల్లారావు, అధ్యాపకులు, విద్యార్థులు

చిక్కడపల్లి, డిసెంబర్ 28: సమాజంలో ఎకానమిక్స్ ప్రతిఒక్కరి జీవితంతో ముడిపడి ఉందని పంజాబ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పుల్లారావు అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీర్ అంబేద్కర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో శనివారం గెస్ట్ లెక్చర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పంజాబ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పుల్లారావు హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని, దాని సాధన కోసం కృషి చేయాలని సూచించారు. ఆర్థిక సంస్కరణలు ప్రగతి కోసం సాధన వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, డైరెక్టర్, అధ్యాపకులతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ మృతి

సైదాబాద్, డిసెంబర్ 28: కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న 50 ఏండ్ల గుర్తు తెలియని వ్యక్తిని చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదన్నపేట రామచంద్రనగర్‌లో గురువారం గుర్తు తెలియని వ్యక్తి (50) పుట్‌పాత్‌పై పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకొన్న పోలీసులు కొన ఊపిరితో ఉన్న ఆ వ్యక్తిని 108లో ఉస్మానియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం అతడు మరణించాడని, మృతుడు బిక్షాటకుడిగా భావిస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

అగ్నిప్రమాదం.. ఆస్తి నష్టం

కాప్రా: మూసి ఉన్న డెకరేషన్ షాపులో అగ్నిప్రమాదం జరిగిన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శ్రీనగర్‌కాలనీ, కాప్రా చౌరస్తా సమీపంలోని జైమాతా డెకరేషన్ షాపులో ఎల్క్ట్రికల్ షార్ట్ సర్క్యూట్‌తో శనివారం వేకువజామున మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం సంభవించింది.స్థానికుల ఫిర్యాదుతో అగ్నిమాపక యంత్రం సంఘటనాస్థలానికి చేరుకోగా సిబ్బంది వెంటనే మంటలను ఆర్పివేశారు. షాపులో చెలరేగిన మంటల వల్ల దుకాణంలో సుమారు రూ.25 లక్షల విలువైన వస్తుసామగ్రి పూర్తిగా కాలిపోయి ఆస్తి నష్టం వాటిల్లిందని షాపు యజమాని మండల సుచిత్ర కుమార్ కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వెంకన్న కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'అవయవదానంపై అపోహలు వద్దు'

మన్సూరాబాద్, డిసెంబర్ 28: లక్షలాది మంది అంధులకు చూపును ప్రసాదించడానికి, అవయవలేమి బాధితులకు పునర్జన్మనివ్వడానికి ప్రజలు ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి. శ్రవణ్‌కుమార్, జీవన్‌దాన్ సంస్థ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. భానుచంద్ర కోరారు. మన్సూరాబాద్ డివిజన్ సహారాఎస్టేట్స్‌కాలనీలోని సీనియర్ సిటిజన్స్ భవనంలో శనివారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర, అవయవ, శరీర దానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవయవాల దానంపై అపోహలు చెందవద్దన్నారు. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల అవయవాలను దానం చేసేందుకు అనేక కుటుంబాలు ముందుకు వస్తున్నాయన్నారు. అనంతరం అవయవ దానానికి ముందుకు వచ్చిన విశ్రాంత కోర్టు ఉద్యోగి రాఘవరెడ్డిని ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అదేవిధంగా బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవాలను దానం చేసిన కుటుంబసభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో వాసన్ ఐ బ్యాంకు మేనేజర్ ఏ. అరవిందకుమార్, సహారాస్టేట్స్ కాలనీ మెయింటెనెన్స్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జానీ, ప్రధానకార్యదర్శి సుదర్శన్ రెడ్డి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, విశ్వనాథం, ప్రకాశ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అవయవ దానానికి ముందుకొచ్చిన రాఘవరెడ్డిని సన్మానిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఫామ్ హౌస్‌పై పోలీసుల దాడి

మద్యం, సౌండ్ సిస్టం స్వాధీనం, ముగ్గురి అరెస్టు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 28: పోలీసుల అనుమతి లేకుండా ఫాం హౌజ్‌ను అద్దెకు ఇచ్చి మద్యం తాగేందుకు ప్రోత్సహించిన ఫాంహౌజ్ యజమానితో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసిన సంఘటన ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం జరిగింది. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పి.పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధి ఎదులాబాద్ శివారు కొత్తగూడెం గ్రామ సమీపంలోని భవానీ ఫాంహౌజ్‌లో శనివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఫాంహౌజ్‌లో జరిగిన కార్యక్రమం అనంతరం యువకులు మద్యం తాగుతున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడి చేసి 24 బీరుబాటళ్లు, సౌండ్ సిస్టంను స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థులకు మద్యం తాగేందుకు ఫాంహౌజ్ యాజమాన్యం ప్రోత్సహించినందున యజమాని మహేష్‌సింగ్, మేనేజర్ బింగి శ్రీశైలం, ఆర్గనైజర్ వికాష్‌లపై కేసు నమోదు చేశారు. పోలీసుల అనుమతి లేకుండా మద్యం తాగడానికి ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ పరశురాం హెచ్చరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దార్యప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కంప్రెషర్ వాహనాలు చోరీ

ఘట్‌కేసర్, డిసెంబర్ 28: పోచారం పోలీస్టేషన్ పరిధిలోని అన్నోజిగూడ లక్ష్మీనర్సింహకాలనీ నుంచి శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కంప్రెషర్ వాహనాలను ఎత్తుకెళ్లారు. ఒక వాహనాన్ని ఇండ్లకు దూరంగా వదిలేసి వెళ్ళగా మరో వాహనాన్ని వరంగల్ రోడ్డు పక్కన వదిలేసి వెళ్లిపోయారు. మరో రెండు వాహనాలను దొంగలు ఎత్తుకెళ్లారు. అదే రాత్రి పోలీసులుకు బాధితులు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

హయత్‌నగర్, డిసెంబర్ 28: రాచకొండ పోలీస్ కమీషనర్ ఆదేశానుసారం ఏహెచ్‌టీయూ ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాచకొండ ఏహెచ్‌టీయూ ఎస్ఐ కె. రాములునాయక్, ఏఎస్ఐ అనురాధ మాట్లాడుతూ.. విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. విద్యార్థులకు చైల్డ్ లేబర్,మహిళల అక్రమ రవాణా, భారత నూతన చట్టాలను వివరించారు. మానవ అక్రమ రవాణాలో ప్రపంచంలోనే భారత్ మూడో స్థానంలో ఉందన్నారు. చైల్డ్ లేబర్, బాండెడ్ లేబర్, బాలికలు, మహిళాలపై లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, లైంగిక దాడులు, బలవంతపు వ్యభిచారం, వేరే దేశాలకు విక్రయించడం, బెగ్గింగ్, యాంటీ ర్యాంగింగ్, సైబర్ క్రైమ్స్, ప్రయాణంలో టీ సేఫ్ అప్లికేషన్, రోడ్డు భద్రతలో ట్రిపుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, హెల్మెంట్ లేకుండా డ్రైవింగ్, మైనర్ బైక్ రైడింగ్, ఈవ్ టీటిజీనింగ్‌పై, భారత కొత్త చట్టాలైన బీఎన్ఎస్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థినులు, మహిళలు ఒంటరిగా ఆటోల్లో, బస్సుల్లో ప్రయాణిస్తున్నపుడు ఏదైనా అనుమానంగా అనిపిస్తే డయల్ 100ను సంప్రదించాలని సూచించారు. ఒకవేళ సైబర్ బెదిరింపులు, మోసాలకు గురయితే సైబర్ క్రైమ్స్ డయల్-1930 ఉమెన్ హెల్ప్ లైన్ -1091 181, చైల్డ్ హెల్ప్ లైన్-1098/112 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.